GV MALL
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 86 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
మంగళవారం 29 అక్టోబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# ప్రజలకు 'ఉచిత ఇసుక' అమలు చేస్తున్నాం: మంత్రి కొల్లు రవీంద్ర

**గత ప్రభుత్వ పాలనలో మైనింగ్ వ్యవస్థను మాఫియా మాదిరిగా చేశారని.. భూ ఆక్రమణలు, దౌర్జన్యాలు, దాడులతో పరిశ్రమలను దెబ్బతీశారని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు.**



**విశాఖ, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** గత ప్రభుత్వ పాలనలో మైనింగ్ వ్యవస్థను మాఫియా మాదిరిగా చేశారని.. భూ ఆక్రమణలు, దౌర్జన్యాలు, దాడులతో పరిశ్రమలను దెబ్బతీశారని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. రాష్ట్రంలో పారిశ్రామిక వ్యవస్థ మొత్తాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. అలాంటి కష్టాల నుంచి తమను తాము కాపాడుకోవాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని గెలిపించుకున్నారన్నారు. విశాఖ జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాల మైనింగ్ అధికారులు, క్వారీ యజమానులతో మంత్రి సమీక్ష నిర్వహించారు."ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. 80 శాతానికి పైగా పూర్తి అయిన పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోలవరానికి కేంద్రం నుంచి రూ.12 వేల కోట్లు తీసుకొచ్చాం. నాలుగు నెలల్లో ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. ప్రతి రంగంలో వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలనే శ్వేత పత్రాలు విడుదల చేశాం. ప్రజలకు ఉచితంగా ఇసుక అందించి తీరుతాం అనే మాటకు కట్టుబడి ఉన్నాం.. అమలు చేస్తున్నాం కూడా. నిర్మాణ రంగాన్ని బలోపేతం చేయడం కోసం ఉచితంగా ఇసుక అందించడమే కాకుండా.. జీఎస్టీని కూడా ప్రభుత్వమే భరించేలా చర్యలు తీసుకున్నాం.గత సీఎం చర్యల కారణంగా మన ప్రభుత్వం వచ్చిన వెంటనే ఇసుక తవ్వకాలకు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నాం. కానీ ఉన్నంత మేరకు ప్రజలకు ఉచితంగా ఇసుక అందించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశాం. బోటు మెన్ అసోసియేషన్ల ద్వారా కూడా ఇసుకను అందుబాటులోకి తీసుకొచ్చాం. సొంత వాహనాల్లో ఇసుక తీసుకెళ్లేవారికి ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూస్తున్నాం. రవాణా ఛార్జీలు, లోడింగ్ ఛార్జీలు చెల్లించి లారీల ద్వారా కూడా తీసుకెళ్లేందుకు అనుమతించాం. రాష్ట్రంలో నిర్మాణ రంగం అభివృద్ధి బాటలో నడవాలి. అందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుంది" అని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు.

# జగన్ సాక్షికి ఇచ్చిన ప్రాధాన్యం 'వెలిగొండ'కు ఇవ్వలేదు: మంత్రి నిమ్మల

**జగన్ పాలన వెలిగొండ ప్రాజెక్టుకు శాపంగా మారిందని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు.**



**దోర్నాల, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** జగన్ పాలన వెలిగొండ ప్రాజెక్టుకు శాపంగా మారిందని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. ప్రకాశం జిల్లా దోర్నాల మండలంలోని ఈ ప్రాజెక్టును సహచర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డీవీబీ స్వామితో కలిసి ఆయన పరిశీలించారు. టన్నెల్లోకి మంత్రులు వెళ్లి పరిశీలించి అధికారులతో మాట్లాడారు. అనంతరం మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ జగన్ పాలనపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సాక్షి పత్రికకు ఇచ్చినంత ప్రాధాన్యం కూడా వెలిగొండ ప్రాజెక్టుకు ఇవ్వలేదన్నారు."వెలిగొండ ప్రాజెక్టుకు గతంలో తెదేపా హయాంలో రూ.1,373 కోట్లు కేటాయించి రూ.1,319 కోట్లు ఖర్చు చేశాం. జగన్ పాలనలో రూ.3,518 కోట్లు కేటాయించి కేవలం రూ.170 కోట్లే ఖర్చు పెట్టారు. ఆయన పాలన వెలిగొండ ప్రాజెక్టుకు శాపంగా మారింది. ఎన్నికల ముందు హడావుడి చేసి జాతికి అంకితమన్నారు. ఏ ప్రాజెక్టు వద్దకు వెళ్లినా జగన్ చేసిన విధ్వంసమే కనిపిస్తోంది. పనులు అప్పగించి పూర్తికాకుండానే నిధులు కట్టబెట్టారు. 10 క్యూసెక్కులు కూడా లేకుండానే వెలిగొండ ప్రారంభోత్సవమన్నారు. ఒక్క గ్రామానికీ పునరావాస కాలనీలు నిర్మించిన పాపానపోలేదు. రెండు దశల్లో ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. వచ్చే సీజన్కు 1.19 లక్షల ఎకరాలకు నీళ్లు అందించాలని ఆదేశించారు. జగన్ మాత్రం సాక్షికి ప్రకటనల రూపంలో రూ.300 కోట్లు ఇచ్చుకున్నారు" అని నిమ్మల రామానాయుడు విమర్శించారు.అంతకుముందు కడపరాజుపల్లి వద్ద ఫీడర్ కాలువను మంత్రి నిమ్మల, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, తెదేపా ఇన్ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మి సందర్శించారు. మంత్రి నిమ్మల స్వయంగా బైక్ నడిపారు. గొట్టిపాటి లక్ష్మితో కలిసి బైక్పై కలెక్టర్ తమీమ్ అన్సారియా వెళ్లారు

# మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు శంకుస్థాపనకు ముహూర్తం ఖరారు

**మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ముందడుగు వేయడమే తప్ప.. వెనక్కి తగ్గే ప్రసక్తేలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.**



**హైదరాబాద్, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ముందడుగు వేయడమే తప్ప.. వెనక్కి తగ్గే ప్రసక్తేలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందే వెయ్యి సార్లు ఆలోచిస్తామని.. తీసుకున్నాక వెనక్కి వెళ్లేది లేదన్నారు. మంగళవారం సచివాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. నవంబరు 1న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేయనున్నట్టు ప్రకటించారు. తొలుత బాపూఘాట్ నుంచి పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. నవంబర్ లోపు ప్రాజెక్టు పనులకు టెండర్లు పిలుసామని చెప్పారు. మూసీ ప్రాజెక్టు పనులపై ప్రతిపక్షాలతో చర్చలకు సిద్ధమన్నారు. త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్టు సీఎం తెలిపారు."భారాస నేతలు మూసీ పునరుజ్జీవంపై అభ్యంతరాలను తెలియజేయాలి. నన్ను కలవడానికి అభ్యంతరమైతే మంత్రులు, అధికారులను కలిసి అభ్యంతరాలు చెప్పొచ్చు. బాపూఘాట్ నుంచి వెనక్కి 21 కి.మీ అభివృద్ధి చేస్తాం. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్లపై విచారణ జరుగుతోంది. విచారణ సమయంలో కక్ష సాధింపు ఉండదు. దర్యాప్తు సంస్థల నివేదికల ఆధారంగానే చర్యలు ఉంటాయి" అని సీఎం వివరించారు.

# ఏపీలో 'ఉచిత గ్యాస్' బుకింగ్స్ ప్రారంభం

**ఆంధ్రప్రదేశ్లో దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం కోసం బుకింగ్స్ ప్రారంభమయ్యాయి.**




**అమరావతి, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** ఏపీలో దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం కోసం బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. ఆధార్, రేషన్ కార్డు ఉన్న ప్రతి గ్యాస్ వినియోగదారుకు రూ.851 రాయితీ రానుంది. నాలుగు నెలలకొక సిలిండర్ చొప్పున ఏటా 3 ఉచిత సిలిండర్లు పంపిణీ చేయనున్నారు. వినియోగదారుడు చెల్లించిన 48 గంటల్లో బ్యాంకు ఖాతాకు నగదు బదిలీ అవుతుంది. నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు మొదటి సిలిండర్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకం ఈ నెల 31 నుంచి ప్రారంభం కానుంది.

# సజ్జలను నిలదీసిన వైకాపా కార్యకర్తలు

**కష్ట కాలంలో అండగా ఉండాల్సిన నాయకులే పట్టించుకోకపోతే ఎలా అని వైకాపా కార్యకర్తలు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని నిలదీశారు.**



**పామర్రు, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** కష్ట కాలంలో అండగా ఉండాల్సిన నాయకులే పట్టించుకోకపోతే ఎలా అని వైకాపా కార్యకర్తలు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని నిలదీశారు. కృష్ణా జిల్లా పామర్రులో మాజీ ఎమ్మెల్యే అనిల్కుమార్ ఇంటికి సజ్జల వచ్చారు. ఈ విషయం తెలుసుకుని పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. నేతలతో మాట్లాడి ఆయన వెళ్లిపోతుండగా.. కార్యకర్తలు అడ్డుకుని నిలదీశారు. ఇంతమంది కార్యకర్తలు వస్తే కనీసం పలకరించకుండా వెళ్లిపోవడమేంటని ప్రశ్నించారు. ధైర్యంగా ఉండి పార్టీ కోసం పోరాడాలనే భరోసా ఇవ్వకుండా అలా ఎలా వెళ్లిపోతారని నిలదీశారు. దీంతో చేసేదేమీ లేక సజ్జలతో పాటు అక్కడి నేతలు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

# విజయవాడలో ఈవెంట్ డ్యాన్సర్ అనుమానాస్పద మృతి

**నగరంలోని అజిత్ సింగ్ నగర్ లో ఈవెంట్ డ్యాన్సర్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు.**



**విజయవాడ, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** నగరంలోని అజిత్ సింగ్నగర్లో ఈవెంట్ డ్యాన్సర్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. మృతురాలిని బంటుపల్లి వెంకటలక్ష్మి (25)గా గుర్తించారు. ఆమె కాకినాడ నుంచి వచ్చి గత కొంతకాలంగా విజయవాడలో ఉంటున్నారు. అద్దెకు ఉంటున్న ఇంట్లోనే ఉరి వేసుకున్న స్థితిలో వెంకటలక్ష్మి మృతదేహం కనిపించింది. శరీరంపై గాయాలు ఉండటంతో స్థానికులు హత్యగా భావిస్తున్నారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు.

# భారాస ఎమ్మెల్యేలకు డ్రగ్స్ టెస్టులు చేయించాలి: కాంగ్రెస్ ఎంపీ అనిల్ యాదవ్


**రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ నేత అనిల్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారాస ఎమ్మెల్యేందరికీ డ్రగ్స్ టెస్టులు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.**



**హైదరాబాద్, అమరావతి,అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ నేత అనిల్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారాస ఎమ్మెల్యేందరికీ డ్రగ్స్ టెస్టులు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. గాంధీ భవన్లో ఆయన మీడియాతో మాట్లాడారు."డ్రగ్స్ బయట పడిన ప్రతిసారి వాళ్లు బయటకు వచ్చి మాట్లాడుతున్నారు. భారాస ఎమ్మెల్యేలు డ్రగ్స్ టెస్టులు చేయించుకోవాలి. రాజ్ పాకాల, విజయ్ మద్దూరిని వెనుకేసుకరావడానికి కేటీఆర్కు సిగ్గు ఉండాలి. గత ప్రభుత్వం డ్రగ్స్ కేసుని ఏ విధంగా దారి మళ్లించిందో ప్రజలకు తెలుసు. జన్వాడ ఫామ్ హౌస్ అంటేనే వివాదాలకు కేంద్రం. ఒకసారి దీపావళి ఫెస్టివల్, ఇంకోసారి గృహ ప్రవేశం అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా చేస్తుంటే.. వాళ్లు డ్రగ్స్ను ప్రేరేపించాలని చూస్తున్నారు" అని ఆయన మండిపడ్డారు.

# మంగళగిరి ఎయిమ్స్ లో డ్రోన్ సేవలను ప్రారంభించిన మోదీ

**మంగళగిరి ఎయిమ్స్ లో డ్రోన్ సేవలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు.**



**అమరావతి,అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** మంగళగిరి ఎయిమ్స్ డ్రోన్ సేవలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. దిల్లీలోని ఏఐఐఏ నుంచి వర్చువల్గా ఆయన ఈ సేవలను ఆవిష్కరించారు. అనంతరం ఎయిమ్స్ అధికారులు ప్రయోగాత్మకంగా డ్రోన్ పరీక్ష చేపట్టారు. ఎయిమ్స్ నుంచి నూతక్కి పీహెచ్సీ వరకూ డ్రోన్ను పంపించారు. ఓ మహిళా రోగి నుంచి రక్త నమూనా సేకరించి ఎయిమ్స్కు అది తిరిగొచ్చింది. ఎయిమ్స్ నుంచి ఈ పీహెచ్సీ దాదాపు 12 కి.మీ దూరంలో ఉంది. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు డ్రోన్ల ఉపయోగంపై ఈ ప్రయోగాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

# హాజీపూర్ మండలంలో పెద్దపులి సంచారం.. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

**మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని ధర్మారం, టీకనపల్లి గ్రామాల పరిధిలోని అటవీ ప్రాంతంలో పులి సంచారం కలకలం రేపింది.**



**హాజీపూర్, అమరావతి,అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని ధర్మారం, టీకనపల్లి గ్రామాల పరిధిలోని అటవీ ప్రాంతంలో పులి సంచారం కలకలం రేపింది. మంగళవారం బుగ్గగట్టు ప్రాంతంలో గొర్రెల మందపై దాడి చేసి మూడు గొర్రెలను హతమార్చింది. గమనించిన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు పాదముద్రల ఆధారంగా పెద్దపులిగా గుర్తించారు. అప్రమత్తంగా ఉండాలని సమీప గ్రామాల ప్రజలకు అధికారులు హెచ్చరికలు జారీచేశారు.

# తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ప్రధాని మోదీ కృషి: కేంద్రమంత్రి బండి సంజయ్

**తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ప్రధాని మోదీ ఎంతో కృషి చేస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు.**



**విశాఖపట్నం,అమరావతి,అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ప్రధాని మోదీ ఎంతో కృషి చేస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. విశాఖపట్నంలోని వీఎంఆర్డీఏలో నిర్వహించిన రోజ్గర్ మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. "ప్రధాని మోదీ రెండేళ్ల క్రితం రోజ్గర్ మేళా ప్రారంభించారు. పది లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలని ఆయన నిర్ణయించారు. రెండేళ్లలో 8 లక్షల మందికి ఇప్పటికే ఉద్యోగాలు ఇచ్చారు. విశాఖపట్నంలో ఇంకా ఎంతో అభివృద్ధి జరగాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించింది మోదీ ప్రభుత్వమే" అని బండి సంజయ్ అన్నారు.


printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1899 : తొలితరం తెలుగు భావకవి, భారత స్వాతంత్ర్యసమరయోధుడు నాయని సుబ్బారావు జననం (మ.1978).
- 1950 : రంగస్థల నటుడు, దర్శకుడు, ప్రయోక్త, కథ, నవలా రచయిత తల్లావజుల సుందరం జననం.(మ.2022)
- 1961 : తెలుగు చిత్ర పరిశ్రమ నటుడు, నిర్మాత కొణిదల నాగేంద్రబాబు జననం.
- 1985 : ఒలింపిక్స్ లో పతకం సాధించిన భారతీయ బాక్సింగ్ ఆటగాడు విజేందర్ సింగ్ జననం. (చిత్రంలో)
- 1971 : ఆస్ట్రేలియాకు చెందిన మాజీ క్రికెట్ ఆటగాడు మాథ్యూ హేడెన్ జననం.
- 1959 : ప్రముఖ తెలుగు సినిమా నటుడు గోవిందరాజులు సుబ్బారావు మరణం (జ.1895).
- 1996 : ప్రపంచంలోనే అరుదైన మానవ తయారీ యురేనియంతో పనిచేసే 30 మె.వా. అణు రియాక్టర్ కామిని, తమిళనాడులోని కల్పక్కంలో పని చెయ్యడం ప్రారంభమయింది


తల్లావజుల సుందరం


కొణిదల నాగేంద్రబాబు


విజేందర్ సింగ్



మాథ్యూ హేడెన్


సుబ్బారావు



# 20 ఏళ్ల తర్వాత రోలెక్స్ కోసం.. ఆసక్తికర విషయాన్ని పంచుకున్న సూర్య

20ఏళ్లుగా దూరంగా పెట్టిన సిగరెట్ను రోలెక్స్ పాత్ర కోసం మళ్లీ తాగినట్లు నటుడు సూర్య తెలిపారు. 'కంగువా' ప్రమోషన్స్లో భాగంగా పలు విషయాలను పంచుకున్నారు.




వైవిధ్యమైన కథలు, పాత్రలను ఎంచుకుని అటు తమిళ, ఇటు తెలుగు ప్రేక్షకులను అలరించే కథానాయకుడు సూర్య లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో కమల్ హాసన్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'విక్రమ్స 2022లో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. సినిమా మొత్తం ఒకెత్తయితే, ఇందులో చివరి 20 నిమిషాలు మరొకెత్తు. డ్రగ్స్ మాఫియాను శాసించే రోలెక్స్ పాత్రలో సూర్య కనిపించింది కొద్దిసేపే అయినా, థియేటర్ మొత్తం దద్దరిల్లిపోయింది. ప్రేక్షకుడు ఓ సరికొత్త అనుభూతితో బయటకు వచ్చాడు. తాజాగా సూర్య నటించిన 'కంగువా' ప్రమోషన్స్లో భాగంగా రోలెక్స్ పాత్ర గురించి ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు.ధూమపానానికి 20ఏళ్లుగా దూరంగా ఉన్న సూర్య కేవలం రోలెక్స్ పాత్ర కోసం మళ్లీ సిగరెట్ కాల్చడం మొదలు పెట్టారు. 'తొలుత సిగరెట్ లేకుండా సన్నివేశాన్ని చేద్దామన్న ఆలోచన వచ్చింది. ప్రతినాయక ఛాయలున్న పాత్ర కావడంతో మరింత ఇంటెన్స్ కోసం సిగరెట్ కాల్చక తప్పలేదు. దర్శకుడు లోకేష్ కేవలం రోలెక్స్ పాత్ర గురించి ఓ ఐడియా చెప్పారంతే. ఆ సీన్ ఏంటి? పాత్ర ఎలా ఉంటుంది? అని వివరించారు. షూటింగ్ వెళ్లే ముందు నేను కనీసం రిహార్సల్స్ కూడా చేయలేదు. పైగా షూటింగ్ రోజు ఉదయం నేను చెప్పాల్సిన డైలాగ్స్ను పంపారు. అవి చదువుకుని సెట్కు వెళ్లిపోయాను. అప్పటికే సిద్ధంగా ఉన్న స్కెచెస్ ఆధారంగా మేకప్ ఆర్టిస్ట్ నన్ను రెడీ చేశారు. మధ్యాహ్నానికి నాకు సంబంధించిన షూట్ పూర్తయింది" అని చెప్పుకొచ్చారు.

కమల్హాసన్ కు అభిమాని అయిన సూర్య ఆయన ఎదుట నటించాలంటే కాస్త భయపడినట్లు చెప్పారు. తనకు సంబంధించిన సన్నివేశాలు తీసే సమయంలో కమల్ హాసన్ సెట్ వస్తారని చిత్ర బృందం చెప్పిందట. దీంతో దర్శకుడు లోకేష్ను పిలిచి 'ఆయన వచ్చేలోపు నా సన్నివేశాలను పూర్తి చేసేయ్' అని కోరినట్లు సూర్య చెప్పుకొచ్చారు. లోకేష్ సినిమాటిక్ యూనివర్స్లో భాగంగా 'రోలెక్స్' పేరుతో ప్రత్యేకంగా ఒక మూవీ రానుంది. గతంలో సూర్య నటించిన ఇంకొకర చిత్రంతో దానికి కనెక్షన్ ఉన్నట్లు ఇటీవల ప్రకటించారు. ప్రస్తుతం సూర్య నటించిన 'కంగువా'కు శివ దర్శకుడు. నవంబరు 14న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది.



# 'తండేల్' అప్డేట్ ఇచ్చిన దర్శకుడు..

## జనవరికి సిద్ధమే.. కానీ!

నాగచైతన్య హీరోగా చందూ మొండేటి తెరకెక్కిస్తోన్న చిత్రం 'తండేల్ తాజాగా ఈ సినిమాపై దర్శకుడు అప్డేట్ ఇచ్చారు. షూటింగ్ దాదాపు పూర్తయినట్లు తెలిపారు.



నాగ చైతన్య ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'తండేల్' చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో సాయిపల్లవి కథానాయిక. సరికొత్త కథాంశంతో రూపొందుతోన్న ఈ చిత్రం కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ సినిమా షూటింగ్పై దర్శకుడు అప్డేట్ ఇచ్చారు. 'షూటింగ్ దాదాపు పూర్తయింది. జనవరికి సిద్ధంగా ఉన్నాం. ఇంకా 10 రోజుల చిత్రీకరణ మాత్రమే ఉంది. సంక్రాంతికి రామ్చరణ్, వెంకటేశ్ సినిమాలు వస్తే.. ఈ సినిమా కొంచెం వాయిదా పడుతుంది. జనవరి 26న విడుదల చేద్దామంటే అది ఆదివారం కాబట్టి చేయలేకపోతున్నాం. సంక్రాంతి కంటే ముందు విడుదల చేయాలంటే సినిమా కంప్లీట్ కాదు. ఇక ఈ సినిమాలో ఎన్నో భావోద్వేగాలు ఉన్నాయి. కచ్చితంగా అందరూ ఈ చిత్రాన్ని ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు. దీంతో వచ్చే ఏడాది ప్రారంభంలో ఈ సినిమా విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.అల్లు అరవింద్ సమర్పిస్తున్న 'తండేల్' దేశభక్తి అంశాలతో నిండిన రా రస్టిక్ ప్రేమకథతో తెరకెక్కుతోంది. నాగ చైతన్య ఇందులో రాజు అనే మత్స్యకారుడిగా కనిపించనున్నారు. తాజాగాఈ మూవీకి సంబంధించిన ఓటీటీ డీల్ పూర్తయింది. చైతూ కెరీర్లోనే అత్యధికంగా రూ.40 కోట్లకు ప్రముఖ ఓటీటీ వేదిక నెటిక్స్ మూవీ రైట్స్ను దక్కించుకుంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఇంతకుముందెప్పుడూ చేయని సరికొత్త పాత్రలో చైతూ.. సాయిపల్లవి డీగ్లామర్ లుక్స్లో కనిపించనుండడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి. కొన్ని రోజుల కిందట హైదరాబాద్లో జరిగిన షెడ్యూల్లో నాగచైతన్యపై ఓ భారీ పోరాట ఘట్టాన్ని తెరకెక్కించారు. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు అందిస్తున్న సంగతి తెలిసిందే.



# ఐపీఎల్ 2025.. ఢిల్లీ క్యాపిటల్స్ ఆ అయిదుగురిని రిటైన్ చేసుకోవచ్చు: హర్భజన్ సింగ్

## ఢిల్లీ క్యాపిటల్స్ రిటెన్షన్ గురించి భారత మాజీ ఆటగాడు హర్భజన్ సింగ్ మాట్లాడాడు.




ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు ఫ్రాంచైజీలు తాము రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను అక్టోబర్ 31లోపు సమర్పించాల్సి ఉంది. ఆరుగురు ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడానికి ఫ్రాంచైజీలకు ఐపీఎల్ పాలకవర్గం అనుమతించింది. ఇందులో ఒక రైట్ టు మ్యాచ్ (ఆర్టీఎం) కలిసి ఉంటుంది. గడువు సమీపించడంతో ఏ ఆటగాళ్లను అట్టిపెట్టుకోవాలనే దానిపై ఫ్రాంఛైజీలు తీవ్రంగా చర్చిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీ క్యాపిటల్స్ రిటెన్షన్ గురించి భారత మాజీ ఆటగాడు హర్భజన్ సింగ్ మాట్లాడాడు.'రిషభ్ పంత్ను ఆ ఫ్రాంచైజీ రిటైన్ చేసుకుంటుందా? లేదా? అనే దానిపై చాలా చర్చలు జరుగుతున్నాయి. దానిని కాలమే నిర్ణయిస్తుంది. కానీ నేను మేనేజ్మెంట్లో భాగమైతే... పంత్ను కచ్చితంగా రిటైన్ చేసేవాడిని. పంత్ తర్వాత అక్షర్ పటేల్ను అట్టిపెట్టుకోవాలి. మూడు, నాలుగో రిటెన్షన్లో ట్రిస్టన్ స్టబ్స్, జేక్ ఫ్రేజర్ ఉండాలి. అయిదవ ఆటగాడిని అట్టిపెట్టుకోవాలనుకుంటే.. అది మిచెల్ మార్ష్ కావచ్చు' అని హర్భజన్ పేర్కొన్నాడు. ఇదిలా ఉండగా, ఢిల్లీ తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు పంత్. 13 ఇన్నింగ్స్లో మూడు అర్ధ శతకాలు సహా 446 పరుగులు చేశాడు. గతేడాది అక్షర్ పటేల్ 235 పరుగులు చేసి, 11 వికెట్లు తీశాడు. స్టబ్స్ కూడా 13 ఇన్నింగ్స్లో మూడు అర్ధ సెంచరీలు సహా 378 పరుగులు చేశాడు. జేక్ ఫ్రేజర్ కూడా తన తొలి సీజన్లో తొమ్మిది ఇన్నింగ్స్ లు ఆడి 330 పరుగులు సాధించాడు.

## అందం

పండుగల సీజన్ కొనసాగుతోంది. ఈ నెల 31న దేశవ్యాప్తంగా దీపావళి పండుగ చేసుకోవడానికి ప్రజలు రెడీ అయిపోయారు. ఇప్పటికే దీపావళి సందడి మొదలైంది. మార్కెట్లలో బాణాసంచా, స్వీట్లు, డ్రై ఫ్రూట్స్ అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. దీపావళికి వివిధ రకాల పిండి వంటలు, స్వీట్లు ఇంట్లో తయారు చేసుకుంటారు. ఇక, దీపావళికి చాలా మంది బహుమతులు ఇస్తూ ఉంటారు. ఇదో సంప్రదాయం. బిజీ లైఫ్ స్టైల్ కారణంగా చాలా మంది.. స్వీట్లను ఇంట్లో తయారుచేసుకోలేరు. దీంతో.. మార్కెట్లో స్వీట్లను కొనుగోలు చేసి బంధుమిత్రులకు గిఫ్ట్గా పంపిస్తుంటారు. అయితే, దీపావళికి స్వీట్లకున్న డిమాండ్ను క్యాష్ చేసుకోవాలని కొందరు వ్యాపారులు ప్రయత్నిస్తున్నారు. దీంతో.. నకిలీ స్వీట్లను ఎక్కువగా అమ్ముతున్నారు. కానీ, తెలిసి లేదా తెలియక చాలా మంది కల్తీ స్వీట్లను ఇంటికి కొని తెచ్చుకుంటున్నారు. కల్తీ స్వీట్లు ఆరోగ్యాన్ని ఒక్కటి కాదు అనేక రకాలుగా హాని చేస్తాయి. వీటిని తినడం వల్ల కొన్ని సార్లు ప్రాణాలకే ముప్పు ఉంటుంది. దీంతో.. ఇలాంటి పరిస్థితుల్లో నకిలీ, నిజమైన స్వీట్ల మధ్య తేడాను ఎలా గుర్తించాలో తెలుసుకోవాలి. స్వీట్లలో కల్తీని గుర్తించి సులభమైన మార్గాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.



# దీపావళికి అనారోగ్యాన్ని ఇంటికి తెచ్చుకోకండి.. నకిలీ స్వీట్లను ఇలా కనిపెట్టండి..



### రుచి ద్వారా కనిపెట్టండి..

స్వీట్లలో కల్తీ చేస్తే దాని రుచి మారుతుంది. స్వీట్ తిన్న వెంటనే ఆ తీపిలో కల్తీ ఉందా లేదా అనేది రుచిని బట్టి అర్థమవుతుంది. అదో రకమైన టేస్ట్ ఉంటే మీకే ఇట్టే తెలిసిపోతుంది. అందుకే మిఠాయిలు కొనే ముందు టేస్ట్ చేయండి. మిఠాయిల రుచి మీకు కొద్దిగా భిన్నంగా లేదా చెడుగా అనిపిస్తే వాటిని కొనకండి. అలాగే.. స్వీట్లలో వాడే నెయ్యిలో కల్తీ జరిగితే.. ఒక రకమైన టేస్ట్ నాలుకకి అందుతుంది. దీంతో.. మీరు ఇట్టే నకిలీ స్వీట్లను కనిపెట్టొచ్చు. కల్తీ స్వీట్లు చెడు రుచిని కలిగి ఉంటాయి.

### రంగు ద్వారా గుర్తించండి..

స్వీట్లకు కుంకుమపువ్వు లేదా ఏలకులు జోడిస్తే వాటికి ప్రత్యేకమైన రంగు ఉంటుంది. కానీ, నకిలీ స్వీట్లకు రసాయన రంగులు వేసి వాటికి కలర్ కోటింగ్ ఇస్తున్నారు. ఇది తీవ్రమైన అనారోగ్య ముప్పుని కలిగిస్తుంది. అందుకే స్వీట్ల రంగు ఎక్కువగా కనిపిస్తే.. ఒకటికి వంద సార్లు ఆలోచించండి. మిఠాయిల కలర్ సహజంగా కనపించకపోతే.. మీరు కొనకండి. అంతేకాకుండా.. రసాయనాల రంగులు వాడితే.. అవి మీ చేతికి, నోటికి అంటుకుపోతాయి. దీంతో.. నకిలీ స్వీట్లను ఇలా కూడా కనిపెట్టొచ్చు.

### వాసన భిన్నంగా ఉంటుంది..

నిజమైన స్వీట్లకు డ్రై ఫ్రూట్స్ వాడటం వల్ల తేలికపాటి సువాసన ఉంటుంది. కానీ నకిలీ స్వీట్లలో ఈ సువాసన ఉండదు. వాటికి వాసన ఉన్నప్పటికీ, ఇది వింతగా అనిపిస్తుంది. నకిలీ నెయ్యి, నూనె స్వీట్లలో వాడితే.. అదో వికారమైన వాసన స్వీట్ల నుంచి వస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో స్వీట్లు కొనే ముందు ఒక్కసారి వాసన చూడటం మంచిదంటున్నారు నిపుణులు..

### స్వీట్ల షేప్ కూడా ముఖ్యం.

నిజమైన స్వీట్ల ఆకృతి మృదువుగా, స్థిరంగా ఉంటుంది. అంతేకాకుండా నిజమైన స్వీట్లు కొంచెం తేమగా ఉంటాయి. అయితే, వీటికి విరుద్ధంగా నకిలీ స్వీట్ల షేప్ ఉంటుంది. వీటిని పట్టుకోగానే.. చేతికి అంటుకుపోతాయి. అంతేకాకుండా.. కొంచెం గట్టిగా, అసమానంగా ఉంటుంది. ఇలా స్వీట్ల ఆకృతిని కనిపెట్టొచ్చు.

### సిల్వర్ పూత..

నకిలీ, నిజమైన స్వీట్ల మధ్య ఒక వ్యత్యాసం ఏమిటంటే, నిజమైన స్వీట్లపై స్విలర్ ఫాయిలింగ్ ఉంటుంది. అయితే, చాలా మంది వ్యాపారులు నకిలీ స్వీట్లపై వేరే ఫాయిల్ను వాడతారు. అప్పుడు.. స్వీట్లను ఒక చెంచాతో రుద్దండి. స్వీట్ మంచిదైతే.. వెండి షైనింగ్ కనిపిస్తుంది. అదే.. అల్యూమినియం ఫాయిల్ అయితే.. ఆ మెరుపు కనిపించదు. అంతేకాకుండా స్వీట్లపై రెండు చుక్కల కాస్టిక్ సోడా వేయాలి. సిల్వర్కి బదులు అల్యూమినియం వాడితే అది వెంటనే కరిగిపోతుంది.గమనిక..ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. తెలుగు సమయం దీనిని ధృవీకరించడం లేదు. ఇది ఎవర్నీ ఉద్దేశించినది కాదని పాఠకులు గమనించాలి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం.